# సాధు శాంతారామ్

శ్రీమతి 'కపిలః' పులవర్తి కమలావతీదేవిగారు

విష్ణురావు బి. ఏ ప్యాసుఅయినాడు. పాపము ఉద్యోగంకోసం అతను ఎందరికో దరఖాస్తు లంపినాడు. దర్శనాలు చేసినాడు. ఏమీ లాభం లేకపోయింది. తుదకు ఇంటర్‌వ్యూకు రమ్మనమని తేనాంపేట సర్వీసు కమిషనుకడనుండి అతనికి శ్రీముఖము వచ్చినది. ఇంటర్‌వ్యూ అనగానే ఉద్యోగ మయిందనే వీరి ఆశ. పాపము తీరా–విష్ణురావుకడ డబ్బు లేదు. స్నేహితుల నడిగిచూశాడు. లాభం లేకపోయింది. భార్య పుట్టింటివారు మంగళ హారతిపళ్లెంలో నాలుగు రూపాయలువేస్తే అవి లాక్కున్నాడు కాని మెడ్రాసుకుటిక్కెట్టు చార్జీకవి సరిపోవు. ఏలాగో రైలులో దూరి ఊరికేనే ప్రయాణం చేయ నిశ్చయించాడు. చిన్న స్టేషనులలో టిక్కెట్టు కలెక్టరు కంట్లో దుమ్ముగొట్టడం నిమిషం. రైలెక్కాడు. బండి కదిలింది. కంపార్టుమెంటులో ఒక సాధు కూర్చున్నాడు. అతనిపేరు సాధు శాంతారామ్. రామకృష్ణ మిషనుకు చెందినవాడు. అతడు కొంత ఇంగ్లీషు పఠించాడు. ఇద్దరికీ బాతాఖానీ బాగాసాగింది. స్నేహముకలిసింది. తనదగ్గిర చపాటీ తినడాని కిచ్చాడు సాధువు. విష్ణురావు తిన్నాడు. ఇంతలో బెజవాడవచ్చారు. టిక్కెట్టు కలెక్టర్లు బండీకొకడు ఎక్కారు తలుపులు తాళాలు వైచి.

ఏలాగరా భగవంతుడా యని విష్ణురావు తల్లడిల్లి పోతున్నాడు. శాంతారాముకూడా మెడ్రాసుకే ప్రయాణం చేస్తున్నాడు. తన టిక్కెట్టు విష్ణురావు కిచ్చి టిక్కెట్టు చూపవలసినదని అతనితో చెప్పి బహిర్దేశాని కరిగినాడు. టిక్కెట్టు కలెక్టరువచ్చి తన్ను టిక్కెట్టు అడిగినాడు. అతనిదగ్గిరలేదు. సాధు టిక్కెట్టునే నాటిక్కెట్టు అని అతని చేతి కిచ్చాడు. అతడు దాన్ని కత్తిరించి తనకిచ్చి 'ఆజేగురుగుడ్డలవాడు పాకీదొడ్లో దూరాడా?' అని ప్రశ్నించెను; రాగానే వాణ్ణి పట్టుకొని వాడేమి మొరపెట్టుకున్నా వినకుండా రైల్లోనుంచి దింపించి బయటికి వెళ్ళగొట్టాడు. విష్ణురావు సుఖంగా చెన్నపట్నం చేరాడు. సాధువులను పాడుచేస్తే విష్ణురావు ఎప్పుడైనా బాగుపడతాడా? కమిషను ఇంటర్‌వ్యూలో విష్ణురావుని అక్కరలేదు పొమ్మన్నారు. చేతిలో రూపాయలు ఖర్చు అయిపోయినాయి. సాధువుని మోసంచేసినా ఫలం లేకపోయిందిగదా యని అతని హృదయంలో ఒకవిధమైన ఆవేదన బయలుదేరింది. కూమునదీతీరాన్నే వెళుతూయున్నాడు. అందులో పడి ఆత్మహత్య యొనర్చుకొన్నాడు. పాపం బంధువులంతా స్వగ్రామములో విచారించారు. లోకం మళ్ళీ ఎప్పటియట్ల సాగిపోతూయున్నది.